ఆ గ్రామం విడిచి వెళుతూ ఆ శిష్యుడు తన ఆసక్తిని అణచుకోలేక అతన్ని అడిగాడు.

"ఈ ఏడాదిలో మీలోని పిసినారితనాన్ని ఎలా పోగొట్టుకోగలిగారో దయచేసి నాకు చెప్తారా?"

"మీ గురువుగారి చలవే అది. కాకులని పరిశీలించమని చెప్పారు. ఆ పని ఇన్నాళ్ళూ చేయబట్టి నేను మారగలిగాను." బదులు చెప్పాడతను.

"దానికీ దీనికీ ఏమిటి సంబంధం?" అర్థంకాక అడిగాడా శిష్యుడు.

"చాలా ఉంది. ఓ కాకికి ఆహారం కనపడగానే అది వెంటనే తినదు. ముందు వెళ్ళి ఇతర కాకులని పిలుచుకు వచ్చాక, సాటి కాకులతో కలిసి తింటుందది. వాటిని చాలా వారాలు పరిశీలించి చూసాక వాటికి గల ఈ బుద్ధి నాకు లేదే అన్న ఆలోచన ఓ రోజు నాకు కలిగింది. అప్పుడు మీ గురువుగారు నన్ను కాకులని ఎందుకు పరిశీలించమన్నారో అర్థమైంది. ఆ రోజునించి నేను నా పిసినారితనం వదిలి ఇతరులకి పెట్టి కాని నేను తినకూడదన్న పాఠం నేర్చుకున్నాను." వివరించాడతను.

## 56. దాన ఫలం

ఓ రోజు ఒకడు దారిన పోతూంటే, ఒంటిమీద నూలుపోగు లేని ఓ బిచ్చగాడు కనిపించాడు. అది చలికాలం కాబట్టి అతను ఆ బిచ్చగాడికి తన ఇంట్లో అదనంగా ఉన్న ఓ కంబళిని తెచ్చి ఇచ్చాడు.

కొద్ది కాలానికి అతను మరణించి చిత్రగుప్తుడి ముందు ప్రవేశ పెట్టబడ్డాడు. ఆ సమయంలో ఆ బిచ్చగాడు కూడా అక్కడే ఉన్నాడు. చిత్రగుప్తుడు ఆ ఇద్దరి పాప పుణ్యాలు లెక్కచూసి బిచ్చగాడ్ని వందేళ్ళు, అతనికి కంబళిని కప్పినతన్ని రెండు రోజులు స్వర్గంలో ఉంచమని యమభటులని ఆజ్ఞాపించాడు.

ఆ తీర్పుకి ఆశ్చర్యపోయిన అతను చిత్రగుప్తుణ్ణి ఇలా అడిగాడు..

"ఇదన్యాయం స్వామి. నేను ఈ బిచ్చగాడికన్నా ధనవంతుడ్ని. ఇలాంటి ఎందరో బిచ్చగాళ్ళకి అనేక వస్తువులు దానం చేసాను. నాకన్నా ఎక్కువ పుణ్యాన్ని ఇతనెలా ఆర్జించగలడు? మీరు పొరబడ్డారంటాను."

"పొరబాటేంలేదు. వీడు ఓ చలికాలం రాత్రి ఓ వృద్ధుడికి కప్పుకునేందుకు ఈ కంబళిని దానం చేసాడు." అని చిత్రగుప్తుడు ఆ కంబళిని చూపించాడు. దాన్ని గుర్తుపట్టిన అతను వెంటనే చెప్పాడు.

"ఇది నేను స్వయంగా నా చేతులతో వీడికిచ్చిన కంబళే. మరి నా దానఫలం ఏమైంది?"

అందుకు చిత్రగుప్తుడు నవ్వి జవాబు చెప్పాడు.

"నువ్వు నీ జీవితకాలంలో దానం చేసినవన్నీ నీకు అవసరం లేవనుకున్నవీ, ఇంట్లో అడ్డుగా ఉన్న చెత్త సామానునే. కాని ఈ బిచ్చగాడు తనకి చలిరాత్రి గజగజ వణికించే చలిని లక్ష్యపెట్టక అత్యంత అవసరమైన కంబళిని తనకన్నా వృద్ధుడైన వాడికి దానం చేసాడు. తద్వారా ఇతను తన స్వార్థాన్ని పక్కకి పెట్టి రోగగ్రస్తుడైన ఇంకో బిచ్చగాడికి సహాయపడటం ద్వారా నీకన్నా ఎన్నో వేలరెట్లు పుణ్యాన్ని ఆర్జించాడు. నీకూ ఇతనికి తేడా అక్కడ వచ్చింది."

## 57. రాముడి రుచి

ఓ చోట నాస్తికసభ జరుగుతోంది. అనేకమంది వక్తలు దేవుడు లేడని ఉపన్యాసాలు ఇస్తున్నారు. జామ పళ్ళు కొనుక్కుని ఒకటి తింటూ ఇంటికి వెళ్తున్న ఓ ఆస్తికుడు ఆ సభ పక్కనించి వెళ్తూంటే, అతనికి దేవుడనే వాడే లేడని, రాముడు కృష్ణుడు అని పేర్లు పెట్టుకుని ఆస్తికులు తమని తాము మోసం చేసుకుంటున్నారన్న మాటలు వినిపించాయి. ఆయన కరకర దోర జామకాయని నములుతూ ఆ సభలోకి వెళ్ళాడు.